జాబితాను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మను చౌదరి, నోడల్ అధికారి జయదేవ్ ఆర్య

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 21:జిల్లాలో ఓటరు జాబితా సవరణ 2024-2025 సంబంధించి ప్రణాళికాబద్ధంగా స్పీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై జిల్లాల కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ అందించారు. సమీకృత జిల్లాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలన్నారు. నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పీప్ నోడల్ అధికారి జయదేవ్ ఆర్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మద్దూరు(ధూళిమిట్ట): మర్కుములలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ వైస్‌చైర్మన్ జీవన్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్ 21 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని దుబ్బాక ఎంపీడీవో భాస్కర శర్మ సూచించారు. సోమవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి, హబ్షీపూర్, రాజక్కపేట, ఎల్లాపూర్, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో బొప్పాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం కృష్ణ పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి,అక్టోబర్ 21 : రైతులను తాము పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో నే విక్రయించాలని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి మార్కెట్ కార్యాలయ అవరణలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ సాయిలు, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

తొగుటలో..

తొగుట, అక్టోబర్ 21 : తొగుట మండల కేంద్రంలోని గుడికందుల, లింగంపేట, రాంపూర్ గ్రామాల్లో సోమవారం ధాన్యం కేంద్రాలను సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. వైస్ చైర్మన్ కుర్మయాదగిరి, సొసైటీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నారాయణరావుపేట, అక్టోబర్ 21: మండల కేంద్రమైన నారాయణరావుపేటతో పాటుగా గుర్రాలగొంది, జక్కాపూర్ , గోపులాపూర్, బంజేరుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఎంపీడీవో శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యం కోనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం అమ్మిమోసపోవద్దని తెలిపారు. ఎంపీవో శ్రీనివాస్, ఏవో పరశురాములు, ఏపీయం చంద్రం, సీసీలు ఆనంద్, హేమలత, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 21: రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మద్దూరు మండలంలోని లద్నూర్, ధర్మారం, మర్కుముల, సలాఖపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జీవన్‌రెడ్డి ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఏవో రామకృష్ణ, సీఈవో బోయిని శ్రీధర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఉత్కూరి మల్లేశం, ఏఈవో అఖిల్, మాజీ సర్పంచ్ రామడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట, అక్టోబర్ 21: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ సింగిల్ విండో వైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. మండలంలోని జనగామ, గొల్లకుంట, కేశనాయక్ తండా, రామవరం గ్రామాల్లో ఐకే పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. దళారులు మాటలు నమ్మి మోసపోవద్దునన్నారు. పీఏసీఎస్ వైస్ వైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, సీసీలు తిరుపతి, శివ, చరణ్ సింగ్, రాజు, డైరెక్టర్ బుర్ర ప్రభాకర్, వీవో అధ్యక్షులు స్వరూప, రాధిక, మంజుల, స్వరూప, సుమలత రైతులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ర్యాలీ

గజ్వేల్, అక్టోబర్ 21 : సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయంలో దేవతా విగ్రహాన్ని ధ్వంసం చేసిన ముస్లిం వ్యక్తిని అతడికి సహకరించిన వారిపై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గజ్వేల్‌లో ర్యాలీ చేపట్టారు. అంగడిపేట హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు శాంతియుతంగా నిర్వహించారు. హైందవ సోదరులు నందబాలశర్మ, శ్రీనివాసచార్యులు, నరేశ్ బాబు, జశ్వంత్‌రెడ్డి, బాలకుమార్, గోలి సంతోశ్‌గుప్తా, రమేశ్‌గుప్తా, పేర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీగా రాజిరెడ్డి

ములుగు, అక్టోబర్ 21 : మండల కేంద్రం ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాయలం వీసీగా డాక్టర్ రాజిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం వైస్‌ఛాన్స్‌లర్ బాధ్యతలు స్వీకరించారు. మాజీ వీసీ నీరజా ప్రభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్ ఉన్నారు.

మున్నూరుకాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా రంజితాకృష్ణమూర్తి

చేర్యాల, అక్టోబర్ 21 : మున్నూరుకాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన, బీఆర్ఎస్ నాయకురాలు తాడెం రంజితాకృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని బర్కత్‌పుర ముున్నూరుకాపు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన 33 జిల్లాల అధ్యక్షుడు అనుబంధ కమిటీల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర అవెక్స్ కౌన్సిల్ మెంబర్ ప్రకాశం రంజితాకృష్ణమూర్తిని రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.

దుబ్బాక ఎమ్మెల్యే హౌస్ అరెస్టు

హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

దుబ్బాక, అక్టోబర్ 21 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కాదని పోలీసు పాలన కొనసాగుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాస గృహంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని అక్కడి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బయటకు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హౌస్ అరెస్టులు చేసింది. ఇందులో భాగంగా దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని అక్కడి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వారంలో మూడు రోజులు హౌస్ అరెస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

హుస్నాబాద్ లో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఏసీపీ సతీశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్, అక్టోబర్ 21: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఏసీపీ సతీశ్ వాసాల, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న స్వర్గీయ ఎస్సై జాన్ విల్సన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సీఐ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎస్ఐ తోట మహేశ్, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, నాయకులు ఎండీ హసన్, బోయిని ఎల్లయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరులో..

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 21 : మద్దూరులో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద ఏఎస్సై ఎన్ విజయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలే వెలకట్టలేవని ఏఎస్సై అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగిరెడ్డి, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపోల్‌లో..

రాయపోల్, అక్టోబర్ 21 : శాంతి భద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని సిద్దిపేట జిల్లా బీజేపీ జవాన్ నీల చంద్రం,ఏఎస్ఐ దేవయ్య అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు.

పసికందును అమ్మకానికి పెట్టిన తల్లి

పట్టుకున్న అధికారులు.. సఖీ కేంద్రానికి తరలింపు

అంగాన్‌వాడీ కేంద్రానికి తరలించిన పసికందుతో పాటు అధికారులు

రాయపోల్,అక్టోబర్ 21 : 20 రోజుల పసికందును విక్రయిస్తున్న తల్లిని పట్టుకొని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అటవీప్రాంతంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఐసీడీఎస్ సుపార్‌వైజర్ గిరిజ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని పల్లెపాడ్ గ్రామ ఆర్‌అండ్ కాలనీకి చెందిన పోతుల రూప రెండో కూతురును అమ్మకానికి పెట్టింది. గజ్వేల్ మార్కెట్‌యార్డు నుంచి గుర్తు తెలియని ఇద్దరు బైక్‌పై వచ్చి ఇందుప్రియాల్ అటవీప్రాంతంలో మాట్లాడుతుండగా, ఇంతలోనే వారికి గొడవ కావడంతో అక్కడే ఉన్న మేకల కాపార్లు అక్కడికి చేరుకోగా, బైక్‌పై వచ్చిన వారు వెళ్లిపోయారు. వారు వెంటనే గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ సుల్తానాకు సమాచారం ఇచ్చారు. 1098 ద్వారా వివరాలు తెలుసుకున్న సిద్దిపేట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇందుప్రియాల్ అంగాన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తల్లి, కూతుర్లను సిద్దిపేటలోని సఖీ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. బిడ్డను ఎందుకు అమ్ముతుందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బలరాం, చైల్డ్ హెల్ప్‌లైన్ కవిత, నర్స్ శ్యామల, అంగాన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట,అక్టోబర్ 21 : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సరైన సమయంలో ఏర్పాటు చేయకపోవడం వల్లే సిద్దిపేట మార్కెట్ యార్డులో రైతులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం ఆరోపించారు. గన్ని బ్యాగులు రాకపోవడం వల్లే మక్కలు, ధాన్యం కొనుగోలు మార్కెట్ యార్డ్‌లో నిలిచిపోయి. అకాల వర్షానికి పూర్తిగా తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సిద్దిపేట మార్కెట్‌యార్డ్‌ను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేంతవరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. నాయకులు ఎల్లారెడ్డి, కొనయ్య గారి ఎల్లయ్య నర్సింహులు, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాక,అక్టోబర్ 21: దుబ్బాకలో కురిసిన వర్షానికి మార్కెట్‌యార్డులో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది.

అర్హులందరికీ గృహజ్యోతి వర్తించేలా కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజులా రాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 21: గృహజ్యోతి పథకం అర్హులందరికీ వర్తించేలా మున్సిపల్ విద్యుత్ అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, విద్యుత్ శాఖ ఏడి సుధాకర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో అందించిన దరఖాస్తులను ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్ ఆప్షన్ రాగానే నమోదు కార్యక్రమం చేపడతామని మున్సిపల్ చైర్ పర్సన్ తెలియజేశారు. కౌన్సిలర్ నాయకులు లక్ష్మణ్ విద్యు త్ శాఖ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికులు హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి

మిరుదొడ్డి, అక్టోబర్ 21 : అసంఘటిత కార్మికులు తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదారి మల్లేశం అన్నారు. సోమవారం ధర్మారం దేశాయి బీడీ కంపెనీ ఎదుట హెచ్ఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. యజమానులు కార్మికుల పొట్టలు కొడుతూ తమ పబ్బం గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కరెంట్ తీగలు తెగిపడి జీవాలు మృతి

మద్దూరు(ధూళిమిట్ట),అక్టోబర్ 21 : వర్షానికి కరెంట్ తీగలు తెగిపడి నాలుగు జీవాలు మృతి చెందిన సంఘటన మద్దూరు మండలంలోని వల్లంపట్లలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారదాసు రమేశ్ జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి కరెంట్ తీగలు జీవాల మీద తెగిపడడంతో జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనలో రమేశ్‌కు సుమారు రూ. 50 వేల నష్టం వాటిల్లింది. జీవాల మృతితో నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఆందోళన

ఐవోసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న లబ్ధిదారులు

గజ్వేల్, అక్టోబర్ 21: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు మరోసారి ఆందోళన బాట పట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను రెవెన్యూ అధికారులు వెంటనే కేటాయించాలని కోరుతూ సోమవారం గజ్వేల్ ఐవోసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. లబ్ధిదారులు ఐవోసీ కార్యాల యం ప్రధాన డోర్ ఎదుట గంటన్నర పాటు బైఠాయించి నిరసన తెలిపారు. కార్యాలయం ముందు లబ్ధిదారులు నిరసన తెలుపుతున్న విషయం తెలుసుకున్న ఆర్డీవో బన్సీలాల్ వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. పేదల కోసం నిర్మించిన ఇండ్లలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. అందులో ప్యాకేజీ అందిన, అందని వారి వివరాల సర్వే చేస్తున్నామని, సర్వే పూర్తికాగనే లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించడంతో పాటు పట్టాలు కూడా అందజేస్తామన్నారు.

నష్టపోతున్న పత్తిరైతులను ఆదుకోవాలి

గజ్వేల్, అక్టోబర్ 21: రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని వ్యాపారులు పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నరని సీపీఐ రాష్ట్ర నాయకుడు బట్టు దయానంద్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నరని, సరైన ధర లేకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభు త్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ రంగంలో కొనుగోలు కేంద్రాలుంటే రైతులను వ్యాపారులు మోసం చేసేందుకు వీలుండదన్నారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా త్వరగా ప్రారంభించి గోనే సంచులు, హమాలీల సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌లను అన్ని పంటలకు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి శివలింగు కృష్ణ, రాజేశం, నర్సింహ్మారెడ్డి, భిక్షపతి ఉన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

మద్దూరులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాలస్వామి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 21 : చేర్యాలను రెవెన్యూడివిజన్‌గా వెంటనే ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు మండల కేంద్రంతో పాటు ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామాల్లో సీపీఎం గ్రామ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ ఒకనాడు తాలుకాగా, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాల ప్రాంతం గతంలో ఉన్న ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా డీలిమిటేషన్‌లో భాగంగా జనగామలో కలిసి తన అస్థిత్వాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రెవెన్యూ డివిజన్ పేరు మీద తమ ఉనికి కోసం అధికార పార్టీ నాయకులు జేఏసీ అని చెప్పి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని నీరుగారుస్తున్నట్లు విమర్శించారు. అన్ని వర్గాలను కలుపుకొని రెవెన్యూ డివిజన్ కోసం సీపీఎం పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముసుగులో జేఏసీ అంటే అడ్డుకుంటాం

చేర్యాల, అక్టోబర్ 21 : అధికారంలో ఉన్న నాయకులు చేర్యాల రెవెన్యూ డివిజన్ తీసుకురావాల్సిందిపోయి, ఆ పార్టీ నాయకులే జేఏసీ ఏర్పాటు చేసి సమావేశాలు పెట్టడం విడ్డూరంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ అధికార పార్టీలో ఉండి జేఏసీ చైర్మన్‌గా ఉన్న డాక్టర్ పరమేశ్వర్ ఎవరి పైన పోరాటం చేస్తారని, ఇది డివిజన్ ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి డివిజన్ కోసం నిజాయితీగా పోరాటాలు చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు మైసంపల్లి రాహుల్ నాయకులు మహేశ్, అనిల్, రంజిత్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు తీరని అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్

చిన్నకోడూరు/సిద్దిపేట,అక్టోబర్ 21 : చెరువు కుంటల్లో చేప పిల్లలు వేయడానికి గతేడాది ఇచ్చిన సంఖ్యలో సగం మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిబంధన విధించడం సమంజసం కాదని ముదిరాజ్ మత్స్యకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పడిగె ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నకోడూరులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెరువు గుంటలో చేప పిల్లల పంపిణీ తగ్గించడం వల్ల ఉపాధి పొందే ముదిరాజ్ సామాజికవర్గానికి నష్టం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. చేప పిల్లల పంపిణీలో సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచన చే యాలన్నారు. గతం కంటే ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ తగ్గించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా చేపపిల్లల పంపిణీ చేయకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి ముదిరాజులు తగిన సమయంలో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

కరువు భత్యం చెల్లించాలి

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 21 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యనిర్వహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల సాధనకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం నగదు రహిత విధి విధానాలను రూపొందించి వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. బాలయ్య, రాములు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో సిద్దిపేట విద్యార్థులకు పతకాలు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలను సాధించిన సిద్దిపేట క్రీడాకారులు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 21 : రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేట విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో రాష్ట్ర క్రీడా సమాఖ్య,ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం జరిగాయి. సిద్దిపేట జపాన్ కరాటే షోటో కాన్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణకు చెందిన క్రీడా విద్యార్థులు మీర్జా అబ్దుల్ అహ్మద్ అలీ బేగ్ అండర్ 11 కట్టా విభాగంలో బంగారు పతకాన్ని,అండర్ 11 గర్ల్స్ కేటాగిరి విభాగంలో అరిఫ హూనైన్ గోల్డ్ మోడల్, అండర్ 15 గర్ల్స్ కుమితేలో అస్మాతరణ్ణం సిల్వర్ మోడల్ సాధించి సిద్దిపేట పేరును నిలబెట్టారు. పతకాలను పొందిన విద్యార్థులను కోచ్ పాషా, సిద్దిపేటకు చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న అంబటి బాలచందర్‌గౌడ్

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 21 : కొండపాక మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా, బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్ గౌడ్ అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు తిప్పారం హరీశ్‌కుమార్, చిన్న రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవులు మృతి

చిన్నకోడూరు, అక్టోబర్ 21: చిన్నకోడూరు మండలం చెల్కలపల్